క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డుకు చెందిన చింతలచెరువు శ్రీను (ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పీఆర్ఓ) తల్లి చింతలచెరువు సరోజిని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్ పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం మృతురాలు సరోజిని మృతదేహం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, తదితర నేతలు ఉన్నారు.

డ్రెయినేజీలో చెత్త తొలగింపు



కృష్ణకాలనీలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న జేసీబీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 25వ వార్డు కృష్ణకాలనీలో సీపీఆర్ అపార్ట్‌మెంట్ వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను ఆ కాలనీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోదాల జానకిరాంరెడ్డి మంగళవారం జేసీబీ సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కాలనీలో అపార్ట్‌మెంట్ వద్ద డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, సమస్యను కాలనీవాసులు తన దృష్టికి తీసుకురావడంతో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు ఉపేందర్, సైదులు, నవీన్, అరుణ్, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

అడవిదేవులపల్లి : మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మంగళవారం ఉపాధి హామీ ఈసీ శంకర్ పరిశీలించారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు కూలీలు పనులు చేయడంతో వారికి సరైన వేతనం అందుతుందన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ జానకి, సీనియర్ మెట్ మధు, బాలకృష్ణలతో పాటు తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి : అనుమతులు లేకుండా దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కొండమల్లేపల్లి పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. మైనంపల్లి తండాకు చెందిన రమావత్ లాలు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రత్యేక పూజలు

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయాన్ని మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి సాయినాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల గొండ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు సాయినాథుడిని దర్శించుకునేందుకు వస్తుండడంతో నల్లగొండ జిల్లాకు గొప్ప పేరొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, ఎల్లంకి అశోక్, వందనపు ఆంజనేయులు, యాదయ్య, ఖాలెద్,రంజాన్ పాల్గొన్నారు.

జూమ్ యాప్ ద్వారా పాలిసెట్ కోచింగ్

కొండమల్లేపల్లి : పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు జూమ్‌యాప్ ద్వారా ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతిరావు తెలిపారు. 2018 నుంచి ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో తన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

చింతపల్లి : మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్ మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు గ్రామ మాజీ సర్పంచ్ ఉజ్జిని హేమలత, నరేందర్‌రావు రూ.5వేలను ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వెంకటంపేట గ్రామానికి చెందిన మల్లిగారి ఆములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం ఆ కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించేలా..

- మున్సిపాలిటీలో నీటివనరుల పునరుద్ధరణపై దృష్టి
- ప్రభుత్వం నుంచి రూ.29 లక్షలు మంజూరు
- బోర్లు, చేతిపంపులు, పైప్‌లైన్లకు మరమ్మతులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. గతేడాది తక్కువ వర్షపాతం నమోదుకావడంతో వేసవి కాలం ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో మున్సిపాలిటీలో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. ఈ క్రమంలో ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక రూపొందించింది. ఈనేపథ్యంలో తాగునీటి వనరుల పునురుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ ద్వారా కొంతకాలంగా నీళ్లు అందిస్తుండడంతో బోర్లు, మోటార్లు కనీస నిర్వహణ, మరమ్మతులు మరిచారు. దీంతో మూలనపడిన వాటిని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో అధికార యంత్రాంగం వేసవిపై ప్రత్యేక దృష్టిని సారించారు.



తాళ్లగడ్డలో పని చేయని చేతి పంపు

యుద్ధప్రాతిపదికన చర్యలు

మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అవసరమైన ప్రైవేట్ బోర్లు అద్దెకు

ప్రస్తుతం మున్సిపాలిటీ జనాభా	1.40.720
మొత్తం నీటి సరఫరా	14.50 ఎంఎల్‌డీ
పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా	10 ఎంఎల్‌డి
మిషన్ భగీరథ నుంచి నీటి సరఫరా	4.50 ఎంఎల్‌డి
మొత్తం చేతి పంపులు	387
ప్రస్తుతం పని చేస్తున్న చేతి పంపులు	358
మొత్తం పవర్ బోర్లు	97
ప్రస్తుతం పని చేస్తున్నవి	75
పని చేయని పవర్ బోర్లు	22

తీసుకొని తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలో ప్రతి రోజూ ఒక గంట మాత్రమే నీరు సరఫరా కావడంతో సరిపోవడం లేదు. వచ్చే నీరు కూడా అడపదడప వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాకు కేటాయించిన నిధుల్లో మిర్యాలగూడ మున్సిపాలిటీకి రూ. 29లక్షలు మంజూరయ్యాయి. వీటి ద్వారా మున్సిపాలిటీ అందుబాటులో ఉన్న చేతి పంపులు, బోరు మోటార్లు, తాగునీటి పైపులకు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

మున్సిపాలిటీలో అధికారుల సమన్వయంతో నీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు నీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే చర్యలను తీసుకుంటున్నాం. ఈ మూడు నెలల పాటు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం.

– బి. వెంకన్న, మున్సిపల్ ఇన్‌చార్జ్ డీఈ

కాంగ్రెస్ అసమర్థ పాలనతో ప్రజలకు కష్టాలు

హాలియా : కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో అన్ని వర్గాల ప్రజలు కష్టాల కడలిలో చిక్కుకున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అధ్యక్షతన, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశ నిర్వహించారు.మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమావేశానికి రాకముందు సభలో మాజీ ఎమ్మెల్యే భగత్ అనుచరులు తమను వేదిక మీదు పిలవలేదంటూ అగ్రహం వ్యక్తం చేయడంతో పాటు కొద్దిసేపు రభస జరిగింది. ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్ కార్యకర్తలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యం పేరుతో మళ్లీ కరువు తెచ్చిందన్నారు. జిల్లాలోని నాగార్జునసాగర్ జలశయంలో నీరు ఉన్నా పంటలు ఎండబెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని చోట్ల దొంగతనాలు పెరిగాయన్నారు. రేవంత్‌రెడ్డి జేబుల్లో కత్తెర్లు పెట్టుకుని తిరుగుతున్నాడన్నారు. 100 రోజుల పాలనలో 200 మంది రైతులు చనిపోయారని గుర్తు చేశారు. సాగర్ ఎడమ కాల్వకు నీటిని ఇవ్వలేని మంత్రులు జిల్లాలో ఇద్దరున్నారన్నారు. జిల్లా మంత్రికి ముఖ్యమంత్రి పదవీపై ఆశ చావలేదన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

సాగర్ ఎడమ కాల్వకు సాగునీరు ఇస్తే దాదాపు 2లక్షల ఎకరాలకు పంట చేతికి వచ్చేదన్నారు. సాగునీటిని పాలేరుకు పోలీసులను పెట్టి నీరు తీసుకెళ్లిన వారు కాంగ్రెస్ పార్టీ నాయకులన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రచారం చేస్తున్న వీరి ఫోన్లు వినే అంతా తీరిక మాకు అప్పుడు లేకుండా ఉండేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలు ఉంటే బయట పెట్టాలన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బిక్షమయ్య గౌడ్, బండ నరేందర్‌రెడ్డి, మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి బ్రిడ్జి తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, రుక్మారెడ్డి, ఎంపీటీసీ కొర్ర గౌతమి, షంశీర్, సీత్యానాయక్, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఆలయ అభివృద్ధికి కృషి

డిండి : రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి మండలంలోని గోనబోయనపల్లిలోని శ్రీ కోదండసతీరామ లక్ష్మణ సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి వృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అన్నారు. మంగళవారం నిర్వహించిన ఆ ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భూషణయ్య, బద్దెల శ్రీనువాసులు, కిన్నెర హరికృష్ణ, పాపయ్య, మల్లయ్య, బాలకృష్ణ, శ్రీశైలం, అనిల్, శుభాష్, శ్రీను పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మిర్యాలగూడ టౌన్ : సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగితేనే మహిళా సాధికారితకు అర్థం ఉంటుందని ఇండియన్ బ్యాంకు అధికారి కన్నాదాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో విశ్వకర్మ యోజన కింద ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ పూర్తయిన తరువాత వారికి బ్యాంకు ద్వారా రూ.లక్ష వరకు రుణాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట విశ్వకర్మ యోజన అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకూరి శ్యాం, రవి, యాదమ్మ, జూలూరు శంకర్ తదితరులున్నారు.



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇండియన్ బ్యాంకు అధికారి కన్నదాస్

అగ్నిప్రమాదాలను జాగ్రత్తగా ఎదుర్కోవాలి

హాలియా : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అగ్నిమాపక అధికారి జానయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో నిర్మల ఆస్పత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, రోగులకు అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఎండాకాలంలో అగ్ని ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే డయల్ 101కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నిర్మల ఆస్పత్రి డాక్టర్ రవికుమార్, అగ్నిమాపక సిబ్బంది ఎండీ నిరంజన్, రామయ్య, రాంరెడ్డి, సైదానాయక్, రాము, మహేందర్, జలంధర్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

దేవరకొండ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా



హాలియా : అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి జానయ్య

మంగళవారం దేవరకొండ అగ్నిమాపక శాఖ సిబ్బంది పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి రాజు నాయక్ అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది సునీల్‌వర్మ, నిరంజన్, పరబ్రహ్మం, ముత్యాలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి, శానిటేషన్‌పై సమీక్షా సమావేశం

అడవిదేవులపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నీటి ఎద్దడి, శానిటేషన్‌తో పాటు ఎన్ఆర్ఈడబ్ల్యూఎస్, ఆల్ పారామీటర్స్, అమ్మ ఆదర్శ పాఠశాలలు, మండల కోడ్ ఆఫ్ కండక్ట్‌పై మంగళవారం ఎంపీడీఓ కరుణాకర్‌రావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపరిచే విధంగా పంచాయతీ కార్యర్శులు కృషి చేయాలన్నారు. ఈ విషయాలపై పంచాయతీ కార్యదర్శులు ఎప్పటిక పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి మోసిన్‌అలీ, ఏపీఓ సూరనాయక్, ఈసీ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్ని నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

మిర్యాలగూడ : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, వ్యాపారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ డీటీ జావిద్ హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని లావూడి తండాలో గల రేషన్ షాపును ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీచేశారు. ఉండాల్సిన బియ్యంకు అదనంగా 12.01 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి డీలర్ చిలువేరు వినోద్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం షాపులో ఉన్న బియ్యం నిల్వలలను పక్క గ్రామమైన చిల్లాపురం రేషన్ డీలర్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు. కాగా మండలంలోని లావూడితండాలో లావూరి శంకర్ అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ సోమవారం దాడి చేసి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన దానిలో రేషన్ డీలర్ పాత్ర ఉందనే అనుమానంతో రేషన్ షాపులో బియ్యం నిల్వలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. రేషన్ డీలర్లు రేషన్ బియ్యం అక్రమంగా తరలించినా, వ్యాపారం చేసినా, వినియోగదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా, కార్డు దారులు రేషన్ బియ్యాన్ని డీలర్‌కు డబ్బుల కోసం అమ్మినా చర్యలు తీసుకోని అట్టి వారి రేషన్‌కార్డును సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ ఉన్నారు.



రేషన్ షాపును పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జావిద్

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీకాంత్ వద్ద రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ నరేందర్ టీఎస్05యుడి 7213 అనే గూడ్స్ వాహనంలో 60 బస్తాల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ నరేందర్‌ను అరెస్ట్ చేసి బియ్యంతోపాటు వాహనాన్ని స్వాదీనం చేసుకోని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నేటి నుంచి శిరసనగండ్ల జాతరకు బస్ సర్వీసులు

దేవరకొండ : నాగర్‌కర్నూలు జిల్లా చారగొండ మండలం శిరసనగండ్లలో జరగనున్న జాతరకు నేటి నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు నడపనున్నట్లు దేవరకొండ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ, డిండి బస్‌స్టేషన్ల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈనెల 17, 20, 21, 22 తేదీల్లో బస్‌లు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



డిండి : చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

డిండి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ ఎస్.తిరుపతయ్య మండలంలోని 71మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ.శ్యామ్‌నాయక్, జూనియర్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దఅడిశర్లపల్లి : మండలంలో 48మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మాజీ ఉప సర్పంచ్ నరేష్

త్రిపురారం : మండలంలోని జీఅన్నారం గ్రామ పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ చిత్రం నరేశ్ జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 12లో ఉన్న చింతల చెరువులోని నల్లరేగడి మట్టిని రెండు విడుతలుగా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామానిక చెందిన వ్యక్తికి రూ.13 లక్షల 50 వేలకు విక్రయించగ వచ్చిన డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.వచ్చిన నిధులను గ్రామ పంచాయతీ అకౌంట్‌లో జమ చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి భిక్షం నాయక్‌పై చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని కోరారు.

ఘనంగా సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి

దేవరకొండ : సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతిని మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మ అశోక చక్రవర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని మతాల వారు స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని మార్పు తీసుకొచ్చిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, వెంకటయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, కాశయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



దేవరకొండ : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కొండమల్లేపల్లిలో ..

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్ కోరారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని పలు బూత్‌లలో నిర్వహించిన బీజేపీ ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. రో మారు మోదీ ప్రధాని కావాలంటే రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.ప్రధాని మోదీ నాయకత్వంలో నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జల్దా భాస్కర్, గీతారాణి, అప్పం అజయ్, పోలగోని గణేష్, ఛండీశ్వర్, శివ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ, బీజేపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నక్క వెంకటేశ్‌యాదవ్, బొడిగె సాంబశివుడు, వరికుప్పల వెంకటయ్య,కుంభం యాదగిరి, జంగిడి మల్లేశ్, భరత్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు రిమాండ్

మిర్యాలగూడ : చెట్లు నరికి అటవీ భూములను ఆక్రమించుకునేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా మిర్యాలగూడ 2వ అదనపు జడ్జి నిందితులకు 14రోజుల రిమాండ్ విధించినట్లు అటవీశాఖ క్షేత్రధికారి ఎస్ ఆనంద్ మంగళవారం తెలిపారు. జువ్విచెట్టుతండాకు చెందిన సపావత్ శంకర్, సపావత్ సోమ్లాలు మిర్యాలగూడ రేంజ్, దామరచర్ల సెక్షన్ మొల్కచర్ల అటవీ పరిధిలోని చెట్లను తొలగించి దారి చేసి వన్య ప్రాణుల అవాసాలను ధ్వంసం చేశారన్నారు.దీంతో పాటు ఉపాధి హామీ పథకంలో చేసిన ఎస్ఎంసీ పనులను చెదరగొట్టి అటవీ భూముల ఆక్రమణకు పాల్పడ్డారన్నారు. వారిని అదుపులోకి తీసుకోని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి 14రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎవరైనా అటవీ భూముల్లో అక్రమ సేద్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అటవీ అధికారుల రాములు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొండమల్లేపల్లి : శ్రీరామ నవమిని పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయంలో గణపతి హోమం, నవగ్రహ పూజ, విష్ణు సహస్ర నామాలు, శ్రీలలిత సర్వదేవత హోమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ కార్యదర్శి నీలా లక్ష్మయ్య, పస్నూరి యుగేందర్‌రెడ్డి, నాయిని తిరుమల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నాయిని రమేశ్‌రెడ్డి, బూడిద వెంకటయ్యయాదవ్, నీల విజయ్, తోటపల్లి కిరణ్, నల్లగాసు అనిల్, పురోహితులు పాల గణపతిశర్మ, పాల సదాశివశర్మ, డేరం జయప్రకాశ్, ఘంటసాల శివప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

త్రిపురారం : అమ్మ ఆదర్శ కమిటీల్లో అక్రమ నియామకాలు జరిగాయలని, తక్షణమే విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని బోర్రాయిపాలెం గ్రామానికి చెందిన గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కొండేటి జయమ్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రతి గ్రామంలో ఆ గ్రామానికి సంబంధించిన గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులను కన్వీనర్‌గా నియమించాల్సి ఉంటుందన్నారు. కానీ మండలంలోని బొర్రాయిపాలెం గ్రామానికి సంబంధించిన కమిటీల్లో త్రిపురారం ఏపీఎం, సీసీ ఇతరులతో కలిసి అర్హతలేని వారిని నియమించారని ఆరోపించారు. ప్రాథమికోన్నత పాఠశాలకు చైర్మన్‌గా కొండేటి జయమ్మను నియమించాల్సి ఉండగా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి వేరే వాళ్లని నియమించారని, కొన్ని రోజుల కిందట మండల అధికారులకు ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆవేదనవ్యక్తంచేశారు. సంతకాలు ఫోర్జరీ చేసి సంఘాన్ని తప్పుదోవ పట్టించిన వారిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆమె వెంట సంఘబంధం సభ్యులు తదితరులు ఉన్నారు.